
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	570.50 (257.8295)	74,474	4835
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.65 (3.82)	1652.65	639.49
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.362 (19.5330)		400

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240



502 కోట్లు

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు లబ్ధి



- ఉమ్మడి జిల్లాలో 10.31కోట్ల మంది మహిళల ప్రయాణం
- నేడు రీజియన్‌లోని అన్ని డిపోల్లో సంబరాలు

నల్లగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటలలోనే అమలు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ద్వారా నల్లగొండ రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 10,31,28,640మంది మహిళలు ప్రయాణంచేశారు. దీంతో మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం వల్ల రూ.502 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు రవాణా సంస్థ ఆదేశాలకనుగుణంగా ఈ నెల 23వ తేదీన బుధవారం నాడు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల పరిధిలో సంబరాలను చేయడానికి నిర్ణయించారు. ఈసంబరాల్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల కు వివిధ పోటీలను నిర్వహించడంతోపాటు బస్సులలో రెగ్యులర్‌గా ప్రయాణించే ఐదుగు రు మహిళలను గుర్తించి వారికి సన్మానం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు...

- మిగతా 7వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రాజకీయపార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. స్థానిక ఎన్నికల నిర్వహణ ఖాయంగా ఉంటుందనే సంకేతాలతో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాయి. వామపక్ష పార్టీల నాయకులు సైతం అవకాశమున్నచోట బరిలో దిగేందుకు ప్రయత్నిస్తుండగా, బీఆర్ఎస్ నాయకులు సైతం రిజర్వేషన్లు ఖరారయితే పోటీపడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



స్థానిక సంగ్రామానికి..

- పరిషత్ ఎన్నికలపై పార్టీల కసరత్తు
- ప్రతి స్థానమూ దక్కించుకునేలా కాంగ్రెస్ వ్యూహం
- సత్తా చాటేందుకు ప్రతిపక్షాల తహతహ
- రిజర్వేషన్లు తేలితే రసవత్తరంగా సాగనున్న స్థానిక సమరం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్థానిక ఎన్నికల పోరుకు రాజకీయపార్టీలు, నాయకులు రంగం సిద్ధం చేసుకుంటుండడంతో క్షేత్రస్థాయిలో సందడి మొదలైంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగురవేయడమే ఏకైక లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఓ వైపు ఇప్పటికే సం స్థాగత ఎన్నికల ప్రక్రియను సీరియస్‌గా కొనసాగిస్తు న్న ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పట్టుని నిరూపించుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో వంద శాతం విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా గురిపెట్టారు. తమతమ నియోజకవర్గాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఏ రిజర్వేషన్ వస్తే ఎవరికి అవకాశమివ్వాలి....? బలమైన నాయకులకు అవకాశమివ్వలేకపోతే వారికి ఎలా నచ్చజెప్పాలనే అంశంలో ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. పార్టీకి, నాయకత్వానికి విధేయతగా ఉంటూ వచ్చిన నాయకులు, యువతకు ఈసారి అవకాశాలు దక్కుతాయని అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యేలు సూచించిన వారికే అభ్యర్థిత్వాలు దక్కనుండడంతో ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు వారిని ప్రస న్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మండలంలో, ఎంపీటీసీ స్థానం పరిధిలో తమ మద్దతుదారులతో కలిసి ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రుల ను కలుస్తూ వారి దృష్టిలో పడే ప్రయత్నాలు చేస్తున్నారు.

పోటీకి సై అంటోన్న ప్రతిపక్షాలు.

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఎన్నికల్లో పోటీచేసి సత్తా చాటేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ సైతం సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుపై అధిష్ఠానంనుంచి స్పష్టత వస్తే దానికనుగుణంగా పోటీచేసే అంశంపై కార్యాచరణ రూపొందించుకునేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతుండగా, సీపీఎం తమకు పట్టున్న స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఆయా స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న నాయకులు ఇప్పటికే స్థానిక సమస్యలపైనా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు సైతం స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం ఎన్నికల ప్రకటన విడుదల చేసిన తక్షణమే అభ్యర్థుల ఎంపికచేసి ప్రచారంలోకి దిగుతామని ఆపార్టీ నేతలు చెబుతున్నారు. రిజర్వేషన్లు తేలితే అభ్యర్థుల ఎంపిక చేపట్టేందుకు పార్టీనేతలు...

- మిగతా 7వ పేజీలో...

కొత్త రేషన్‌కార్డులు 49వేలు

జిల్లాలో 25 నుంచి పంపిణీకి ఏర్పాట్లు



నల్లగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 49వేల కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించేందు కు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికార యం త్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. అయితే ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లాలోని 8 మండలాల్లో కొంతమందికి పంపిణీ చేపట్టారు. జిల్లాలో నల్లగొండ, తిప్పర్తి, కనగల్, నకిరేకల్, కేతేపల్లి, చిట్యాలతో పాటు మిర్యాలగూడ డివిజన్‌లోని రెండు మండలాల్లో రేషన్‌కార్డుల పంపిణీ జరిగింది. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టారు. ఇందుకు సంబంధించిన ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పౌరసరఫరాలు, ఇతర శాఖల అధికారులకు సూచించడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 5,15,061 కార్డులు

నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 4,66,061 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి 13,85,506 యూనిట్లు పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో 96వేల దరఖాస్తులు రాగా ఇందులో 49వేల మందికి కొత్తగా రేషన్‌కార్డులు అందజేస్తున్నారు. అంటే జిల్లాలో మొత్తం రేషన్‌కార్డులు 5,15,061కు చేరాయి. కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారందరికీ సెప్టెంబరు నెలలో రేషన్‌బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. జూన్‌లో మూడు నెలలకు కలిపి రేషన్ కార్డుదారులకు 26వేల మెట్రిక్ టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. మూడు నెలలకు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేయడంతో ప్రతి ఒక్కరూ రేషన్ కార్డు కావాలని కోరుకుంటున్నారు. సన్నబియ్యంతో రేషన్ కార్డు విలువ పెరిగింది. లబ్ధిదారులకు గతంలో ఉన్న ఆహార భద్రత కార్డు మాదిరిగానే కొత్త రేషన్‌కార్డు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట శుభాకాంక్షలతో ముద్రించిన లేఖలను అందజేస్తున్నారు. పూర్తిస్థాయిలో డిజిటల్ కార్డు ఇప్పట్లో అందజేసే అవకాశాలు లేక పోవడంతో లేఖల రూపంలో ముద్రించిన వాటినే కార్డులుగా అందజేస్తున్నారు. వాటిని రేషన్ దుకాణానికి తీసుకెళ్తే లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తారు. డిజిటల్ కార్డు వచ్చే వరకు ఈ లేఖను జాగ్రత్తగా పెట్టుకోవాల్సి ఉంటుంది.

రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తగా మీసేవా నుంచి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందజేస్తున్నారు. ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను నిరంతరంగా చేపట్టనుం ది. చాలా మంది అర్హులు రేషన్‌కార్డు వస్తుందో లేదోనన్న నేపథ్యంలో ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్‌కార్డు తప్పకుండా ఇస్తామని స్పష్టత ఇచ్చింది. అయితే ప్రజాపాలనలో 96 వేల దరఖాస్తులు వస్తే కేవలం 49 వేల రేషన్ కార్డులు మంజూరు కాగా 47వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతోనే అర్హులైన చాలామంది లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. తమ దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారనే దానిపై ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్న వారంతా రెవెన్యూ కార్యాలయం, పౌరసరఫరాల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మళ్లీ దరఖాస్తులను పరిశీలిస్తుందా? లేదా పక్కనపెడతుందా? అనేది లబ్ధిదారులకు ఎటు పాలుపోవడం లే దు. రేషన్ కార్డులపై సన్నబియ్యం వస్తుండటంతో చా లా మంది నిరుపేదలు రేషన్‌కార్డు కోసం ఎదురు చూ స్తున్నారు. అంతే కాక ప్రతీ సంక్షేమ పథకానికి ప్రభుత్వం రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుందన్న ఆలోచనతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరుగుతోంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు పంపిణీ చేస్తాం. కొత్తగా రేషన్‌కార్డులు 49వేలు మంజూరయ్యాయి. ఇప్పటికే 8మండలాల్లో రేషన్‌కార్డుల పంపిణీ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు రేషన్‌కార్డులను పంపిణీ చేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షల పేరిట లబ్ధిదారులకు ఈ రేషన్‌కార్డులను అందజేస్తాం. రేషన్‌కార్డు ద్వారా ప్రతీ కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తాం.

- వెంకటేశ్వర్లు, డీఎస్‌వో నల్లగొండ

'భూ భారతి' దరఖాస్తులను పరిష్కరించాలి

రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, అధికారులు

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల్లో సాధ్యమైనన్ని ఆగస్టు 14వ తేదీలోపు పరిష్కరించాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వివిధ అంశాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు కొన్ని జిల్లాల్లో ఇసుక ఇబ్బంది ఉందని, ఇసుక అందుబాటులో ఉన్న జిల్లాలు ఇతర జిల్లాలకు సరఫరా చేయాలని అన్నారు. ఇసుక కారణంగా ఇందిరమ్మ ఇళ్లు ఎక్కడా ఆగవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించాలని ఆయన సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు పథకం కింద పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వనమహోత్సవం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెద్దమొత్తంలో పెద్ద మొక్కలు నాటాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఎయిడ్స్ అప్లయెన్సెస్ కోసం లబ్ధిదారులను గుర్తించి జాబితా పంపాలన్నారు.

హెల్త్ కమిటీలను వేగవంతం చేయాలి : కలెక్టర్

పారిశుధ్యం, ఆరోగ్య విషయాలపై పాఠశాల స్థాయి మొదలుకొని మండల, జిల్లా స్థాయిలో శానిటేషన్, హెల్త్ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఈ అంశంపై ప్రతీరోజు పర్యవేక్షించాలని, ప్రత్యేకించి ఈత చెట్లు ఎక్కువగా నాటాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పెంచాలని, స్టోన్ క్రషర్ ధరలు నిర్ణయించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌కు సూచించారు. పాఠశాలల పరిధిలో పారిశుధ్యం, ఆరోగ్యానికి సంబంధించి పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయా సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలల్లో అత్యవసరమైన సివిల్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆర్‌సీవోలను ఆదేశించారు. ఆయా పాఠశాలలకు గుడ్ల సరఫరా విషయమై శుక్రవారం నాటికి టెండర్లను పూర్తిచేయాలని, అలాగే సంక్షేమ శాఖకు సంబంధించి ఉపకరణాల విషయంలో వివరాలు సమర్పించాలని సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్‌అమిత్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సింహవాహినీ దేవిగా ఎల్లమ్మ తల్లి



కనగల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం ఆషాఢమాసం చివరి మంగళవారం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారు సింహవాహినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారిని దివ్యస్వరూపాన్ని దర్శించుకుని పరవశించారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపిం చి చీరసారె బోననైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి, సిబ్బంది, అర్చకులు తదితరులున్నారు.

పోషణ కిట్లను వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నార్కట్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్తులు పోషణ కిట్లను సద్వినియోగం చేసకోవాలని జిల్లా వైద్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని క్షయ బాధితులకు క్యాబ్స్ అండ్ బ్రౌజ్ అనే స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఫుడ్ బ్యాగ్‌లను ఆయన నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో మంగళవారం అందజేశా రు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 100 రోజుల టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా ఈ కిట్లను వినియోగించుకొని క్షయ రోగులు కోలుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఈ వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి కల్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, కేశ రవి, డీపీవో విష్ణు, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్, అజయ్, సైదులు పాల్గొన్నారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు దారి మళ్లిస్తే సంబంధిత ఎరువుల దుకాణం యజమానితోపాటు, సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఎరువుల ఫిర్యాదుల కేంద్రాన్ని, టోల్ ఫ్రీ నెంబర్ (18004251442)ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాలకు సాగునీరు వస్తున్నప్పటికీ, జిల్లావ్యాప్తంగా ముమ్మర వ్యవసాయ సాగు, విత్తనాలు, నాట్లు వేసే సమయంలో సైతం అవసరమైనన్నీ ఎరువులను సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎరువులకు ఎవరూ కంగారు పడాల్సిన పని లేదన్నారు. ఒకేసారి 30 లేదా 40 బస్తాల ఎరువులను తీసుకు వెళ్లే వారిపై చర్య తీసుకుంటామన్నారు. ఎరువుల పర్యవేక్షణకై ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు చెప్పారు. మిర్యాలగూడ ఎరువుల గోదామును ఎప్పటికప్పుడు తాము సందర్శిస్తున్నామని, ఈ నెలాఖరులోగా జిల్లాకు 3000 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని స్పష్టం చేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతాయి

మిర్యాలగూడ: సన్నబియ్యం రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇల్లు పెన్షన్ల వంటివి పేదల ఆత్మగౌరవాన్ని పెంచే కార్యక్రమాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం ఎమ్మె ల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డుల్లో పేర్లు లేనివారు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందన్నారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 15వేల రేషన్‌కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమం అనంతరం నాగార్జున జిల్లా మార్కెటింగ్ సొసైటీలోని ఎరువులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల,జూనియర్ కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. కార్యక్రమంలోసబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ హరీష్, తహసీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి) రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, పారిశుధ్య చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఎరువుల దుకాణాల ముందు ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పావని, ఎంపీడీవో సంగీత, ఏవో శివరామ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలి

మిర్యాలగూడ: ప్రాథమిక సహకార కేంద్రాల ద్వారా రైతులకు సక్రమంగా ఎరువులను పంపిణీ చేయాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని పీఏసీఎస్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల్లో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. రైతుల ఆధార్‌ను నమోదు చేసుకుని యూరియాను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి సైదానాయక్, తహసీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మగ్దుంనగర్‌లో వ్యవసాయ యూనివర్సిటీ?

రాష్ట్ర ప్రభుత్వం సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గానికి మంజూరు చేసిన వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలం ఎంపిక దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఈ క్రమంలోనే హుజూర్‌నగర్ మండలంలోని మఠంపల్లి రోడ్డులోని మగ్దుంనగర్, ఎర్రగట్టు ప్రాంతాల మధ్య ఉన్న ప్రభుత్వభూమిలో యూనివర్సిటీని నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నారు. హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని 1,041 సర్వే నెంబరులోని 273 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఆ స్థలంలో యూనివర్సిటీ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



మగ్దుంనగర్ సమీపంలోని భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు

గతంలో బూరుగడ్డ ప్రాంతంలోని 604 సర్వే నెంబరులో 164 ఎకరాలు ఉండగా ఆ స్థలం తమకు అనుకూలంగా లేకపోవడంతో నియోజకవర్గంలోని మండలాల్లోని పలు స్థలాలను పరిశీలించిన ఉన్నతాధికారులు చివరికి హుజూర్‌నగర్ పరిధిలోని మగ్దుంనగర్ స్థలాన్ని ఎంపికచేసినట్లు తెలిసింది. ఇక్కడి 1041 సర్వే నెంబర్‌లో సుమారు 300 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు.

కాగా యూనివర్సిటీకి ఇదే స్థలం అనువైనదని అధికారులు నిర్ధారించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో యూని వర్సిటీకి సంబంధించి స్థానిక అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు తెలుస్తోంది.

సర్వే పూర్తి

ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న భూమికి ప్రభుత్వధర ప్రకారం నష్టపరిహారం చెల్లించనున్నారు. ప్రసుత్తం 1,041 సర్వే నెంబరులో ఎంతమంది సాగు చేస్తున్నారన్న వివరాలను సేకరించారు. గతంలో కొంతమంది రైతులకు లావణి పట్టాలు పంపిణీచేశారు. మగ్దుంనగర్ గ్రామం కొంత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డీబీఆర్ స్కూల్ సమీపంలోని కుడి, ఎడమల 1,041 సర్వేనెంబర్లలో 273 ఎకరాల 200ఎకరాల్లో ఈ యూనివర్సిటీకి కేటాయించినట్లు తెలిసింది. భూమికి సంబంధించి సర్వే పూర్తిచేశారు. నెల రోజుల నుంచి మట్టపల్లి రోడ్డులోని ప్రభుత్వభూమికి సం బంధించి హద్దులు ఖరారు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. 10 రోజుల క్రితం వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, అడ్మిన్ విభాగం అధిపతి, జిల్లా వ్యవసాయ అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్ల బృందం కలిసి భూసేకరణ చేసిన స్థలాన్ని పరిశీలించారు.

మంత్రి ఉత్తమ్ కృషి

వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారు. భూసేకరణ పూర్తయితే ప్రభుత్వం నుంచి అనుమతులకు చేయించ నున్నారు. సుమారు 200 ఎకరాలలో రూ.1000 కోట్లతో యూనివర్సిటీ నిర్మించేందుకు మంత్రి భావిస్తున్నారు. గతంలో ఉన్న యూనివర్సిటీ, కళాశాలల కన్న భిన్నంగా మెరుగైన వసతులతో యూనివర్సిటీని నిర్మించాలని ఉత్తమ్ సంకల్పించారు. భూసేకరణకు సహకరించాలని ఉత్తమ్ రైతులను, వివిధ వర్గాలను కోరారు. యూనివర్సిటీ ఏర్పాటు ఎంతో ముఖ్యమైనదని, ఈ ప్రాంత రైతాంగానికి యూనివర్సిటీ నిర్మాణంతో మేలు జరుగుతుందని ఉత్తమ్ భావిస్తున్నారు.

భూములు పరిశీలన చేశాం



వ్యవసాయ యూనివర్సిటీకి అవసరమైన భూములు పరిశీలించాం. మగ్దుంనగర్‌లోని 1,041 సర్వే నెంబర్‌లో 273 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రోడ్డు వెంట ఉండడంతో పాటు యూనివర్సిటీకి ఈ స్థలం అనువైందిగా ఉన్నతాధికారులు గుర్తించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

-నాగార్జున్‌రెడ్డి, తహసీల్దార్

అంతా ప్రభుత్వ భూమే అయినా...

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లికి వెళ్లే రోడ్డుకు కుడి వైపే 200 ఎకరాలు ఉండగా ఎడమ వైపు మరో 73 ఎకరాలు ఉన్నట్లు తెలిసింది. ఇదిలాండగా ప్రభుత్వ భూమిలో సుమారు 300 మంది రైతులు సాగు చేసుకుంటుండగా వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించనున్నది. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఎకరానికి సుమారు రూ.20లక్షల మేర నష్ట పరిహారం అందించే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవంగా 1041 సర్వే నెంబర్‌లోని 273 ఎకరాలు ప్రభుత్వ భూమి అయినప్పటికీ ఆ రైతులను కూడా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో నష్టపరిహారం అందించనున్నారు. కాగా గత 20 ఏళ్ల నుంచి సుమారు 70 మంది రైతులకు లావణి పట్టాలను అందించారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ హయంలో పట్టాలు పంపిణీ చేయగా వారందరికీ ప్రభుత్వం తగు పరిహారం అందించనున్నట్లు తెలిసింది. కాగా వ్యవసాయ యూనివర్సిటీకి సంబంధించి భూసేకరణ వ్యవహారం ప్రాథమికంగా ఖరారు కాగా ఉన్నతాధికారులు, ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఆదిరెడ్డి (ఫైల్)

వేములపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెంలో విద్యుదాఘాతంతో రైతు మంగళవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నంద్యాల ఆదిరెడ్డి(58) మంగళవారం మధ్యాహ్నం ఊరి శివారులోని బోరుబావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో సమీపంలోని రైతు నలబోతు వెంకన్న అక్కడికి వెళ్లి చూడగా ఆదిరెడ్డి పొలంబడిలో విగతజీవిగా పడి ఉండడంతో గమనించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు చూసి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి..

చివ్వెంల, జూలై 22 (ఆంధ్రజ్యోతి):అతివేగంగా కారు ఆటోను వెనక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంజులూరు స్టేజీ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ రత్నం తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట పట్టణంలోని ముత్యాలమ్మగుడి బజారుకు చెందిన సత్యనారాయణ(65) అదే కాలనీకి చెందిన అనిల్‌తో కలిసి ఆటో ట్రాలీలో పాత ఇనుప సామాను తిరుమలగిరి గ్రామంలో కొనుగోలు చేసి గుంజలూరుకు వస్తున్నారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న కారు ఆటో ట్రాలీని ఢీకొట్టడంతో బోల్తాపడింది. దాంట్లో ఉన్న సత్యనారాయణకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కన ఉన్న అనిల్‌కు గాయాలయ్యాయని, సత్యనారాయణ కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి విద్యార్థి ..

దేవరకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కమలాపూర్‌లో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి విద్యార్థి మృతి చెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం ముదిగొండ గ్రామానికి చెందిన నల్ల రాజు కుమారుడు నల్ల నితిన్(18) దేవరకొండలో ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం ముదిగొండ నుంచి దేవరకొండకు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఎక్కాడు. ట్రాక్టర్‌కు, ట్రాలీకి మధ్యలో ఉన్న రాడ్డుపై నిలబడ్డాడు. డ్రైవర్ బొడ్డుపల్లి యాదగిరి అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం, సడెన్‌బ్రేక్ వేయడంతో కమలాపూర్ వద్ద రాడ్డుపై నిలబడి ఉన్న నితిన్ కిందపడడంతో వెనుక టైర్ అతడి పైనుంచి వెళ్లింది. దీంతో నితిన్‌కు తీవ్రగాయాలు కాగా దేవరకొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరి నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని నితిన్ తండ్రి రాజు పిర్యాదు మేరకు యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం



మద్యం మత్తులో కారు నడపటంతో ధ్వంసమైన ద్విచక్రవాహనాలు, కారు

భూదాన్‌పోచంపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో మద్యం మత్తులో యువకులు కారును అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించారు. సంఘటనలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన ఉడుతల లోకేష్ సోమవారం రాత్రి తన స్నేహితులతో కలిసి కారులో మద్యం తాగుతూ వచ్చి స్థానిక ఏకేఎల్‌బీ కాంప్లెక్స్ పక్కనే ఉన్న సూరపల్లి భూషణ్ ఇంటి ముంగిట పార్కింగ్ చేసిన బైకులను అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలతో పాటు మరో స్కూటీ పూర్తిగా ధ్వంసమైంది. ఢీకొట్టిన సమయంలో అతిపెద్ద శబ్ధం రావడంతో భూషణ్ కుటుంబసభ్యులు అందరూ బయటకు వచ్చి చేసేసరికి వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇదేమని ప్రశ్నించిన లోకేష్‌ను ప్రశ్నిస్తే మద్యం మత్తులో అసభ్యంగా తిడుతూ గొడవకు దిగి నానా బీబీత్సం సృష్టించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ విషయంపై సూరపల్లి భూషణ్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారులోంచి మంటలు..



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

కోదాడరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామశివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఓ కారు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. కారులో ఉన్న ఇరువులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు కొమరబండ వై-జంక్షన్ వద్ద అదుపుతప్పి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్న ఇరువురు కారులో ఉన్న లగేజీ తీసుకుని బయటకు వచ్చారు. మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన కొందరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కారు విజయవాడకు చెందిన అనిల్‌దిగా పోలీసులు గుర్తించారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలదేని, రూరల్ పోలీసులు తెలిపారు.

తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతూ బాలిక మృతి



నందిని(ఫైల్)

మర్రిగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో తీవ్రఅస్వస్థతకు గురైన విద్యార్థిని మృతి చెందింది. వివరాల్లోకి వెళితే శివన్నగూడ గ్రామానికి చెందిన గుణగోని లింగయ్య, శోభల రెండవ కుమార్తె నందిని(12) మండలకేంద్రంలో కస్తూర్బా పాఠశాల వసతిగృహంలో ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతోంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఈ నెల 13న నందినికి జ్వరం వచ్చిందని ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. 14వ తేదీన తల్లిదండ్రులు బాలికను ఇంటికి తీసుకెళ్లారు. బాలికకు వైద్యం అందిస్తుండ గానే ఈ నెల 21న తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో స్థానిక మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తల్లిదండ్రులు మంగళవారం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి నందినిని తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. నందిని మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నెలన్నరగా రెక్కీ..దుకాణం సమీపంలో నివాసం



అనుమానితులుగా భావిస్తున్న దొంగలు చోరీ అనంతరం అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి వెళ్లిపోతున్న దృశ్యం(సీసీ కెమెరాల్లో నమోదు)

సూర్యాపేట క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో చోరీ కేసును ఛేదించేందుకు జిల్లా పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. చోరీ జరిగిన దుకాణంతో పాటు సమీప ప్రాంతాల్లో లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్న అనుమానితులు నగల దుకాణం సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఘటన అనంతరం పరారైనట్లు సమాచారం తెలుసుకున్నారు. ఆ ఇంటికి వెళ్లి కొన్ని సిమ్ కార్డులు, ఇతర వివరాలు సేకరించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బంగారు ఆభరణాలతో వారి ప్రాంతాలకు వెళ్తే వారిని పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలను తిరిగి స్వాధీనం చేసుకోవడం కష్టతరమవుతుందనే ఆలోచనతో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆదేశాల మేరకు పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి అనుమానితుల కోసం గాలిస్తున్నారు. చోరీకి పాల్పడినవారు సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా జాగ్రత్తపడ్డారు. అయితే వారు నివసించిన ఇంటి సమీపంలోని వీధిలో ఆయా దుకాణాల నిర్వాహకులు ఏర్పాటుచేసుకున్న సీసీ కెమెరాల్లో మాత్రం వారి కదలికలు నమోదయ్యాయి. వాటి సాయంతో పోలీసులు చోరీ జరిగిన, అనుమానితులు నివాసం ఉన్న ప్రాంతంలోని స్థానికులతో మాట్లాడడంతో వారు ఇతర రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. అంతేకాకుండా చోరీకి ఉపయోగించిన సిలిండర్, గ్యాస్ కట్టర్‌ను కూడా తీసుకెళ్తున్న వీడియోలు సీసీ కెమెరాల్లో నమోదుకావటంతో వారేనని ఓ నిర్ధారణకు వచ్చారు.

నెలన్నరకుపైగా పేటలో నివాసం

చోరీ చేయడానికి వచ్చిన ఐదుగురు వ్యక్తులు సూర్యాపేటలోని నిర్మల ఆస్పత్రి ముందు భాగంలో నెలన్నర రోజులకు పైగా నివాసం ఉన్నారు. చోరీ జరిగిన నగల దుకాణానికి సమీపంలో శిథిలావస్థకు చేరిన రెండు గదుల ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇంటి యజమాని మిర్యాలగూడలో ఉండగా ఆ ఇంటి పక్కన నివాసం ఉంటున్న వారి ద్వారా మాట్లాడి నెలకు రూ.5వేల చొప్పున అద్దెకు మాట్లాడుకుని నివాసం ఉన్నారు. అద్దెకు తీసుకునే సమయంలో తాము కొత్తబస్టాండ్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పగా, ఆ ఇంట్లో మాత్రం నివాసం ఉండేందుకు ఉపయోగించే ఎలాంటి వస్తువులు పోలీసుల తనిఖీల్లో కానరాలేదు. కేవలం నిద్రించేందుకు ఒక చాప మాత్రం ఉంది. ప్రతి రోజూ ఉదయం బయటకు వెళ్లి అర్ధరాత్రి సమయంలో తిరిగి ఇంటికి వచ్చేవారని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. దీంతోపాటు అద్దెకు ఉండే నివాసం సమీపంలో నగల దుకాణం గురించి కొన్నిరోజులుగా రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అంతా నగదు రూపంలోనే చెల్లింపులు

నెలన్నరకుపైగా సూర్యాపేటలో నివాసం ఉన్న అనుమానితులు సమీపంలోని కిరాణ దుకాణంలో సిగరెట్లు, ఇతర అవసరాలకు ఉపయోగించే వస్తువులు కొనుగోలు చేశారు. కానీ ఎక్కడా కూడా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు చేయలేదు. అదేవిధంగా ఇంటి అద్దె కూడా రెండు నెలలకు సంబంధించి రూ.10వేలను నగదు రూపంలోనే అందజేశారని స్థానికులు చెప్పారు. ఎక్కడైనా ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు జరిపితే దాని ఆధారంగా వ్యక్తులను గుర్తించే అవకాశం ఉండటంతో నగదు లావాదేవీలు చేసినట్లు భావిస్తున్నారు.

చోరీకి గురైంది రెండున్నర కిలోలే

సూర్యాపేటలోని శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో చోరీ జరిగిన బంగారు ఆభరణాల మొత్తం ఎంత అనేదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చోరీ జరిగిన విషయాన్ని గ్రహించిన నగల దుకాణ యజమాని కిశోర్ తన దుకాణంలో సుమారు 15నుంచి 18కిలోల వరకు బంగారు ఆభరణాలు, సుమారు రూ.20లక్షల నగదు, 40తులాల బంగారు బిస్కెట్లు చోరీకి గురైనట్లు తెలిపాడు. కానీ విచారణ అనంతరం పోలీసులు మాత్రం చోరీకి గురైంది కేవలం రెండున్నర కిలోలు మాత్రమేనని చెబుతున్నారు. సుమారు ఆరు కిలోల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించకుండా చోరీ చేసిన వద్దనే వదిలి వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. అయితే చోరీ చేసిన ప్రదేశంలో లభించిన బంగారు ఆభరణాల్లో కొంత మొత్తంలో తీసుకుని ఇంకా కొంత మొత్తాన్ని ఎలా వదిలి వెళ్తారనే సందేహం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయంలో అసలు చోరీకి గురైన సొత్తు ఎంత అనే విషయాలు తెలియాల్సి ఉంది.

త్వరలోనే ఛేదిస్తాం: ఎస్పీ నర్సింహా

శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసును త్వరలోనే ఛేదిస్తామని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. చోరీ జరిగిన, అనుమానిత వ్యక్తులుగా గుర్తించిన వారు నివసించిన ప్రాంతంలో సాంకేతిక పరిజ్ఞానంతో పలు ఆధారాలు సేకరించామని తెలిపారు. చోరీకి గురైన సొత్తు విషయంలో దుకాణ యజమాని ఆందోళనలో ఎక్కువ మొత్తంలో చోరీ జరిగినట్లు తెలిపాడని, పూర్తిస్థాయిలో పరిశీలించడంతో సుమారు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు మాత్రమే చోరీ జరిగినట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

నాట్లు వేసి దమ్ము చేసి..

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తు లక్ష్మారెడ్డి మంగళవారం మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడులో మహిళా కూలీలతోకలిసి వరి నాట్లు వేశారు. అంతకుముందు భూమిని దమ్ము చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)



మహిళా రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వింత జంతు పాదముద్రలు



వలిగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని టేకులసోమారం, పనుమటివారిగూడెంలోని పొలాల్లో వింత జంతువు సంచరిస్తుందన్న అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. పత్తి చేన్లలో రెండురోజుల నుంచి జంతువు కాలిముద్రలు కనబడ్డాయి. తోడేలు, హైనా, నక్క జాతికి సంబంధించిన జంతువు పాదముద్రలు కావచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కాలి ముద్రలను ఫారెస్టు అధికారి రాజ్యానాయక్ పరిశీలించారు.

రెండుతలల గొర్రెపిల్ల



వలిగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో గొర్రెలకాపరి నోముల మల్లేషయాదవ్‌కు చెందిన గొర్రెకు రెండుతలలతో కూడిన గొర్రెపిల్ల మంగళవారం జన్మించింది. దీనిని చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపారు. పాలు తాగడానికి ఇబ్బందిపడుతుందని గొర్రెలకాపరి తెలిపారు. జన్యుపరమైన లోపంతో ఇలాంటివి జన్మనిస్తాయని పశువైద్యాధికారి రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

చెరువు శిఖంలోని బ్రిడ్జి తొలగింపు



చెర్వు శిఖంలో వేసిన బ్రిడ్జి తొలగింపును అడ్డుకుంటున్న స్వెక్షా ఉద్యోగులు

నార్కట్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం, ఎం.ఎడవల్లి రెవెన్యూ శివార్లలోని పెద్ద చెర్వు శిఖంలో నిర్మించిన బ్రిడ్జి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను స్వెక్షా రియల్‌ఎస్టేట్ సంస్థ ఉద్యోగులమని చెప్పుకునే కొంతమంది మంగళవారం అడ్డుకునే ప్రయత్నంచేశారు. రెండు గ్రామాల శివార్ల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ శిఖం భూముల్లో స్వెక్షా సంస్థ వెంచర్‌ను వేసి ప్లాట్లను చేసినట్లుగా నిర్ధారించిన రెవెన్యూ, ఐబీ అధికారులు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రిడ్జితో పాటు ఇరువైపులా వేసిన మట్టిరోడ్డును కూల్చివేసే పనులను ఆదివారం నుంచే చేపట్టారు. ఐతే మంగళవారం సిమెంట్ పైప్‌లపై వేసిన సిమెంట్ కాంక్రీట్ డ్రిల్లింగ్ పనులను ఆర్ఐ తరుణ్, ఐబీ ఏఈ నాగరాజులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్వెక్షా రియల్ ఎస్టేట్ సంస్థ ఉద్యోగులు పనులను అడ్డుకోబోయారు. దీంతో అధికారులకు స్వెక్షా సంస్థ ఉద్యోగులకు మధ్య వాగ్వాదం జరిగింది. మా ఎమ్మెల్యే మాట్లాడుతాడంటూ ఫోన్ ఇవ్వబోగా అధికారులు నిరాకరించారు. కలెక్టర్ లేదా ఆర్డీవో ఆపేయమని చెబితే ఆపేస్తామంటూ ఆర్ఐ ఘాటుగా సమాధానమిచ్చారు. అయినా పనులను అడ్డుకునే ప్రయత్నం చేయగా తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుకు ఆర్ఐ ఫోన్‌ద్వారా చేరవేశారు. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్‌తో పాటు అక్కడకు వెళ్లిన పనులను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనుదిరిగారు. ఏఎస్ఐ, జమేదార్‌ల రక్షణలో తొలగింపు పనులను కొనసాగించారు.

కోతికి దహన సంస్కారాలు

మునగాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో కోతికి దహనసంస్కారాలు నిర్వహించారు. హైదరాబాద్-విజయవాడ రహదారిపై సాగర్ ఎడమకాల్వ సమీంలో రోడ్డు దాటుతున్న కోతిని వాహనం ఢీకొనటంతో మృతి చెందింది. అది చూసి చలించిన సామాజిక ఉద్యమ కారుడు గంధం సైదులు, తాడ్వాయి పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, గన్నా నరసింహారావు, వెంకటేశ్వర్లు మంగళవారం దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

30 సెల్‌ఫోన్లు స్వాధీనం

భువనగిరి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బాధితుల నుంచి అపహరించిన రూ.4 లక్షల విలువైన 30 సెల్‌ఫోన్‌లను వివిధ ప్రాంతాలలోని నిందితుల నుంచి భువనగిరి టౌన్ పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదుల ఆధారంగా సాంకేతిక విధానంలో జరిపిన దర్యాప్తులో అపహరణకు గురైన సెల్‌ఫోన్లను వినియోగిస్తున్న వారిని గుర్తించి ఆ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితులకు మంగళవారం పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ ఫోన్లను అందజేశారు. చోరీకి గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రూ.502 కోట్లు..

(5వ పేజీ తరువాయి)

నల్లగొండ డివిజన్ పరిధిలో ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉచిత బస్సు ప్రయాణ పథకం నిరంతరం కొనసాగుతుంది. ప్రభుత్వం, సంస్థ ఆదేశాల మేరకు సంబరాలను విజయవంతం చేయాలని ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్ కె.జానిరెడ్డి కోరారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రీజియన్ పరిధిలో ఉచిత ప్రయాణికుల సంఖ్య, మహిళలకు ఆదా అయిన డబ్బుల వివరాలు ఇలా

డిపో	మహాలక్ష్మి ప్రయాణికులు	ఆదా అయిన డబ్బు(రూ.కోట్లల్లో)
దేవరకొండ	1,96,45,453	10391.59
నల్లగొండ	1,53,52,391	6437.86
మిర్యాలగూడ	1,54,85,729	5731.05
నార్కట్‌పల్లి	36,25,576	1446.29
సూర్యాపేట	2,10,88,760	12165.47
కోదాడ	1,25,05,494	6240.49
యాదగిరిగుట్ట	1,54,25,237	7866.82
మొత్తం	10,31,28,640	50,279.57

మోడల్ స్కూల్ టీచర్లకు పదోన్నతి కల్పించాలి



కేతేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

శాలిగౌరారం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వాలు నమోదు చేయించారు. వల్లాల మోడల్ స్కూల్ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడల్ ఉపాధ్యాయుల సమస్యలు 010, నోషనల్ ఇంక్రిమెంట్, పదోన్నతుల గురించి వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, నాయకులు సుంకరి భిక్షంగౌడ్, కాళం నారాయణరెడ్డి, పున్న శ్రీనివాసు, గుత్తా ప్రభాకర్‌రెడ్డి, వల్లాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు కుక్కడపు శ్రీనివాసు, సంధ్యారాణి, దామెర్ల కృష్ణయ్య, కేతేపల్లి శ్రీను, చంద్రశేఖర్ శ్రీరాములు, సంధ్య, సంగీత, సృజన, అనురాధ, మల్లేష్, జేబున్నీసా, రవి, రాధ, సువర్ణ, సరస్వతి, పావని పాల్గొన్నారు.

కేతేపల్లి: రాష్ట్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010పద్దు కింద త్వరలో వేతనాల అందుతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొర్లపహాడ్ గ్రామ మోడల్ స్కూల్‌లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేయించారు. 2012-13నోషనల్ సర్వీసు, హెల్త్ కార్డులు మరి కొద్ది రోజుల్లో మోడల్ స్కూల్ బోధనా సిబ్బందికి అమలులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాదె వెంకటరెడ్డి, జి. కుశలవరెడ్డి, మేకల జానారెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎస్. భిక్షంగౌడ్, కె. నర్సింహ్మరెడ్డి, కె. వెంకటరెడ్డి, రమేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమత ఉన్నారు.

గోదాం నిర్మాణానికి టెండర్లు

యాదగిరిగుట్ట, జూలై 22(ఆంధ్రజ్యోతి): దేవస్థానంలో అధికారులు మంగళవారం గోదాం విభాగానికి చెందిన టెండర్లు వేశారు. 12గ్రాముల బరువు, 22 మి.మీ వ్యాసం, 1.5అంగుళాల స్టాండ్ కలిగిన రాగి వృత్తాకార (ఇరువైపులా స్వామివారి, చతుర్భుజ సత్యదేవుడు) ప్రతిమలు, సత్యదేవుని వ్రత పీటలపై పర్చుకునేందుకు 20/20 అంగుళాల వస్త్రం అందజేతకు టెండర్లు నిర్వహించారు. ప్రతిమలకు ఆన్‌లైన్ ద్వారా ఒకటి, ఆఫ్‌లైన్ ఐదు, వస్త్రానికి ఆఫ్‌లైన్ ద్వారా మాత్రమే ఆరు టెండర్లు వచ్చాయి. ప్రతిమలు, వస్త్రానికి ఐదుగురు చొప్పున టెండరుదారులు వేలంలో పాల్గొన్నారు. తేదీ, సమయం, ప్రదేశం ప్రకటించకుండానే ఈ నెల 9న ఇదే టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. 'టెండర్ నిర్వహణ ఇలాగేనా?' అనే శీర్షికన ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా టెండరును రద్దు చేసి మంగళవారం నిర్వహించారు.

తపాలా సేవలు మరింత వేగవంతం



హెడ్‌పోస్టాఫీస్‌లో కౌంటర్లు ప్రారంభిస్తున్న రంజిత్ చౌదరి

మిర్యాలగూడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు తపాలా సేవలు వేగవంతంగా లభిస్తాయని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ రంజిత్‌చౌదరి తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయంలో కొత్తగా అభివృద్ధి చేసిన ఐటీ 2.0 కౌంటర్లను మంగళవారం ప్రారంభించారు. భారత ప్రభుత్వం డిజిటల్ సేవలను మరింత పటిష్టంగా అందించేందుకు ఐటీ 2.0 పథకం ద్వారా పోస్టాఫీస్ సేవలు వేగవంతం చేసిందన్నారు. గతంలో ప్రైవేట్ మ్యాడ్యులర్ ద్వారా పోస్టాఫీస్ సేవలు అందేవని, ప్రస్తుతం సొంత నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్‌మాస్టర్ ప్రతాప్‌సింగ్, సిస్టమ్ అడ్మిన్ మహేశ్, ఉపాశంకర్, రవి, గోపినాయక్, ఎండీ. సిరాజొద్దీన్ పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషిచేయాలి

చిట్యాలరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి లేకుండా శాశ్వతంగా నిర్మూలించాలని సామాజిక ఆరోగ్య అధికారి నర్సింగ్‌రావు, చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఈసం వెంకటేశం అన్నారు. టీబీ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలో టీబీ వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిశ్రమలో పనిచేసే సిబ్బందికి వైద్యపరీక్షలు చేసి నమూనాలు సేకరించారు. ఎవరికైనా దగ్గు అధికంగా ఉండి తెమడ వస్తే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. తగ్గకపోతే టీబీ పరీక్షను చేయించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివవాని, జోషికమల, వెంకటరమణ, నాగరాణి, విజయ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

సవార్ల సవారీ



కనగల్‌లో సవారీ ఊరేగిస్తున్న భక్తులు

పీర్ల పండుగలో భాగంగా నల్లగొండ జిల్లా కనగల్ గ్రామంలో సవార్లను ఊరేగించారు. ముజావర్లు ఫయాజ్, రియాజ్, జహీర్‌ల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో ఇంటింటికి తిప్పుతూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు సవారుకు నీళ్లారబోసి వస్త్రాలు కట్టి కుడుకలు, బెల్లం, బొంగులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి సమీపంలో వాగులో నిమజ్జనం సవార్లు చేసి వేడుకను ముగించినట్లు ముజావర్లు ప్రకటించారు.

● ఆంధ్రజ్యోతి, కనగల్

స్థానిక సంగ్రామానికి.. సై

(5వ పేజీ తరువాయి)

సిద్ధంగా ఉన్నారు.

రంగం సిద్ధం చేసుకుంటున్న నేతలు ..

పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న స్థానిక నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలే కీలక పాత్ర వహించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లోనూ ద్వితీయ స్థానంలో నిలిచిన బీజేపీ అదే తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలని భావిస్తోంది. అందులో భాగంగానే జిల్లాస్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించింది. త్వరలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో వర్క్‌షాపులు నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికల్లో తీసుకోవాల్సిన ఎజెండాను ఖరారు చేస్తున్నారు. ఏ రిజర్వేషన్ వస్తే ఏ స్థానంలో ఎవరిని నిలబెట్టాలనే విషయంలోనూ పార్టీ ఆరా తీస్తుంది. ప్రతి స్థానం నుంచి ముగ్గురి పేర్లను పరిశీలించి అభ్యర్థిని ఎంపికచేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్షాలు సైతం స్థానిక ఎన్నికల్లో బలంగా పోటీ పడాలని భావిస్తుండడంతో స్థానిక సమరం రసవత్తరంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇక.. కల్యాణ వైభోగమే

● ఉమ్మడి జిల్లాలో ఒక్కటి కానున్న మూడు వేల జంటలు ● ఫొటో, వీడియోగ్రాఫర్లు బిజీ బిజీ



యాదగిరిగుట్ట రూరల్, జూలై 22, (ఆంధ్రజ్యోతి): పెళ్లి భాజాలు మోగనున్నాయి. ఈ నెల 25 శ్రావణ మాసం మొదలు నవంబరు చివరి వరకు ఊరూ వాడా పెళ్లి సందడి నెలకొననుంది. బంగారు నగల దుకాణాలు, వస్త్రదుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ సుమారు మూడు వేల జంటలు ఒక్కటి కానున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రీ వెడ్డింగ్, మెహందీ, సంగీత్, పోస్ట్ వెడ్డింగ్ షూటింగ్ వంటి అదనపు కార్యక్రమాలతో సందడి నెలకొంటుంది. ఫొటో, వీడియోగ్రాఫర్లు బిజీ కానున్నారు. వస్త్ర, బంగారు ఆభరణాల దుకాణాల్లో సందడి నెలకొంది. ముందుగా పెళ్లికూతురు, కుమారుడికి ఇంటి ఆడపడుచులు చక్కగా మెహందీ(గోరింటాకు) గానా భజానా, సంగీత్, మరుసటి రోజు మంగళ స్నానాలు చేయించి పెళ్లి కూతురు, కుమారుడిని ఎవరి ఇంటివద్ద వారిని ముస్తాబు చేయించడంతో పెళ్లి సందడి వేడుకలతో ప్రత్యేక పండుగగా నిర్వహిస్తుంటారు.

పెళ్లినాటి జ్ఞాపకాల పదిలానికి..

జీవితంలో పెళ్లినాటి తీపి జ్ఞాపకం. దానిని పదిలంగా దాచుకునేందుకు ఫొటోగ్రఫీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. పూలపండ్లు, ఆహ్వానంతో మొదలయ్యే ఫొటోగ్రఫీ హల్దీ, సంగీత్, ప్రీ వెడింగ్, వివాహం, రిసెప్షన్ ప్రతి వేడుకలను జీవిత కాలం జ్ఞాపకంగా వీడియోలు, ఫొటోలకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఖర్చుకు వెరవడం లేదు.

ఆడంబరంగా ఉండేందుకు..

గతంలో వధూవరులకు ముస్తాబు చేయడానికి పెద్దగా ఆడంబరంగా లేక నామమాత్రంగా తీర్చిదిద్దేవారు. ప్రస్తుతం పెళ్లిలో వాడే ప్రతి వస్తువూ కళాత్మకంగా ఉండే విధంగా చూసుకుంటున్నారు. మహారాజులు ధరించే తలపాగలు, సంప్రదాయ టోపీలు, కాళ్లకు రాచరికపు షూ, రాళ్లు పొదిగిన చెప్పులు, పగడాలు, పూలజడలు, చేతులకు వంకీలు, మోచేతుల నుంచి పాదాల వరకు గోరింటాకు, బ్యూటీషియన్లతో ముఖానికి బ్యూటీ పార్లర్‌ల సోకులు, ముత్యాల అలంకరణాలు, సీతారాములు, అలవేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి దేవతల మాదిరిగా రంగురంగులా ముత్యాల తలంబ్రాలు, రాజదరహాసం ఉట్టిపడే వస్త్రాభరణాలు, రాజదర్బార్ చక్కని పూల అలంకరణతో కల్యాణ వేదికలను ముస్తాబు చేస్తున్నారు.

పెళ్లిలో బంగారు ఆభరణాలదే అగ్రస్థానం

ప్రతి పెళ్లిలో బంగారానిదే అగ్రస్థానంగా మారింది. వరకట్నం పేరుతో పెట్టే కానుకల స్థానంలో బంగానికే పైచేయిగా మారింది. కనీసం 50 గ్రాముల నుంచి వంద గ్రాముల బంగారంతో తయారు చేసిన బంగారు ఆభరణాలు పెళ్లికూతురు మెడలో ఉండాల్సిందేనని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బంగారానికి అయ్యే ఖర్చుతో పాటుగా ప్రత్యేక లాంచనాల రూపంలో మరికొన్ని లక్షల రూపాయల కానుకలు ఇవ్వాల్సిందే. వివాహానికి విచ్చేసిన బంధువులు, అతిథులకు ఇచ్చే ప్రత్యేక బహుమతులతో మరించి ఖర్చు పెడుతూ ఇబ్బంది పడుతున్నారు.

25నుంచి నవంబరు వరకు ముహూర్తాలు



ఈ నెల 25 నుంచి 31 వరకు, ఆగస్టు 1నుంచి 17, వరకు శ్రావణ మాసం ఉంది. ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21వరకు భాద్రపద మాసం ఇది శూన్య మాసం కావవడంతో పెళ్లి ముహూర్తాలు ఉండవు. తిరిగి సెప్టెంబరు 23 నుంచి 28, అక్టోబరు నుంచి 31వరకు నవంబరు నుంచి 30తేదీల వరకు చక్కని వివాహ ముహూర్తాలు ఉన్నాయి.

● పురోహితుడు శంకర్‌శర్మ, యాదగిరిగుట్ట

ప్రాధాన్యం ఇస్తున్నారు



పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల అలంకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆనాటి అలంకరణకు స్వస్తి పలికి ఆధునికతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సంప్రదాయాలతో పాటుగా ఆకర్షణీయంగా అందంగా ఉండేందుకు సామాన్యులు సైతం డెకరేషన్ చేయిస్తున్నారు.

● గుండ్లపల్లి కృష్ణగౌడ్, డెకరేషన్ నిర్వాహకుడు యాదగిరిగుట్ట

జీవితాంతం పదిలంగా ఉండే జ్ఞాపకాల కోసం



జీవితంలో ఒకేసారి జరిగే పెళ్లి జీవితాంతం పదిలంగా ఉండే జ్ఞాపకాలుగా బంధించి ఉండటానికి ఫొటో, వీడియో, డ్రోన్‌ల సాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. వధూవరుల కోరిక మేరకు కనీసం రూ.50వేల మొదలు రూ.5లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. .

● బసవరాజు యాదగిరిగుట్ట, ఫొటో, వీడియోగ్రాఫర్

ఫంక్షన్‌హాళ్లకు ప్రాధాన్యం

ఆనాటి కాలంలో ప్రధానంగా వధువు ఇంటివద్ద వివాహం చేస్తే తనకు పుణ్యం దక్కుతుందనే నమ్మకం. నేడు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి ఫంక్షన్‌హాళ్లు బుక్ చేసుకుంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇదే అదునుగా ఫంక్షన్‌హాళ్ల యజమానులు నామ మాత్రంగా కూలర్లు, ఏసీలు బిగించి రూ.50నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. లక్షలు ఖర్చు చేస్తూ అన్ని రకాలు వంటకాలు చేయిస్తున్నారు.

పరిశోధనకు పెద్దపీట వేయాలి

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



కళాశాల స్థాపక మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్వయంప్రతిపత్తి కళాశాలలు పరిశోధనకు పెద్దపీట వేయాలని, అధ్యాపకులు, విద్యార్థులు బాధ్యతతో మెలగాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగిన నాగార్జున ప్రభుత్వ కళాశాల స్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎన్జీ కళాశాల 69 సంవత్సరాలు పూర్తి చేసుకొని 70వ వసంతంలోకి అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. నాగార్జున ప్రభుత్వ కళాశాలకు రానున్న కాలంలో నాక్ 'ఎ' గ్రేడ్ రావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. దీనికి పూర్వ విద్యార్థుల సంఘం కూడా సహకరించాలని సూచించారు. నిధులు సేకరించి కళాశాలను అభివృద్ధి చేయాలన్నారు. అధ్యాపకులు పాఠం చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా పరిశోధనలో నిమగ్నం కావాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం కేవలం 50 శాతమే ఉండడం శోచనీయన్నారు. కనీసం 75 శాతం హాజరు శాతం ఉన్న విద్యార్థులకే ఉపకారవేతనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ కళాశాల విద్య ఉన్నతాధికారులకు సూచించారు. విద్యార్థుల భౌతిక, అకాడమిక్ ప్రగతిని ప్రతిరోజూ నమోదు చేయాలన్నారు. నాక్ గుర్తింపుకు అవసరమైన రికార్డులను తయారు చేయాలని అన్నారు. తెలంగాణ కళాశాల విద్య సంయుక్త సంచాలకులు డాక్టర్ డీఎస్‌ఆర్. రాజేంద్రసింగ్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని ఉద్యోగ అవకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగ ప్రకటనను గమనిస్తూ సిద్ధం కావాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఏటా బంగారు పతకాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి జి. ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ కళాశాల విద్య విశ్రాంత సంయుక్త సంచాలకులు జి. యాదగిరి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రాజు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాజారాం, నాగార్జున ప్రభుత్వ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, విశ్రాంత అధ్యాపకులు లింగయ్య, లక్ష్మయ్య, మీనయ్య, అకాడమిక్ కొఆర్డినేటర్ పరంగి రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ అంతటి శ్రీనివాస్, నాగార్జున పరీక్షల నియంత్రణాధికారి బత్తిని నాగరాజు, అంతర్గత నాణ్యతా ప్రమాణాల సమన్వయ కర్త వైవీ. ఆర్. ప్రసన్నకుమార్, తెలుగు శాఖ అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు ముని స్వామి, ఎ. మల్లేశం, సుధాకర్, కోటయ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మౌనం సరికాదు



సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

భువనగిరి గంజ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను మోసం చేస్తుంటే ప్రశ్నించే ప్రతిపక్షాలు మౌనంగా ఉండడం సరికాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో మంగళవారం జరి గిన దివ్యాంగులు, చేయూత పించన్‌దారుల మహాగర్జన సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రుణమాఫీ నిధులు తామే ఇచ్చామని అధికార, ప్రతిపక్షాలు ప్రచారం చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం ఉన్నోడికే దోచి పెడుతోందని, లేనివాడికి మాత్రం ఏమీ లేదన్నారు. కౌలు రైతులకు, ఉపాధి కూలీలకు ఏమి ఇచ్చారని ప్రశ్నించారు. ఓట్లు సీట్ల కోసం పార్టీలు పోటాపోటీగా హామీలు ఇస్తూ నిరుపేదలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే పింఛన్లు పెరిగాయన్నారు. ప్రజా ప్రతినిధులకు, ఉద్యోగులకు సమయానికి జీతాలు వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం పింఛన్‌దారులకు ఒక నెల పెండిం గ్ ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు వితంతువులు గీత, బీడీ కార్మికులతో పాటు అన్ని రకాల పించన్లను రూ. 4వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం ఖాసీం, జిల్లా అధ్యక్షుడు ధరణికోట నరసింహ, నాయకులు బీర్రు మహేందర్‌మాదిగ, ఇటుకల దేవేందర్, నల్ల చంద్రస్వామి, దుబ్బ రామకృష్ణ, గిద్దె రాజేష్, బట్టు రాంచంద్రయ్య, రజిత, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయ స్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణల అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దురంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహించే సైకిల్‌యాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని డ్రగ్స్ అనే మహమ్మారి పట్టిపీడిస్తోందన్నారు. తెలిసీ తెలియకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టి మోసపోతున్నారన్నారు. దీంతో ఆత్మహత్యలు చేసుకున్న అనేకమంది యువకులు 30 ఏళ్ల లోపు వారే ఉన్నారన్నారు. లోన్ యాప్‌లకు, బెట్టింగ్ యాప్‌లకు విద్యార్థులు, యువకులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువకులు చెడు మార్గంలో వెళ్తే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. డ్రగ్స్ గంజాయిని రవాణా చేస్తున్న వారిపై, నిషేధిత యాప్‌లను ప్రమోట్ చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గుండాల నరేష్, పాలాది కార్తీక్, జి. రఘువరన్, కిరణ్, సుక్కార్, తరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన దాశరథి



సమావేశంలో మాట్లాడుతున్న గజవెల్లి సత్యం

నల్లగొండ కల్చరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన మహాకవి దాశరథి కృష్ణామాచార్యులు అని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నల్లగొండ తాలూకా అధ్యక్షుడు గజవెల్లి సత్యం, ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్ అన్నారు. దాశరథి శత జయంతి సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులఅర్పించారు. తన కలం ద్వారా ప్రజలను చైతన్యం చేసేందుకు ఉద్యమాన్ని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రమేష్, కేశావాశారి, పుల్లయ్య, బాలరాజు, గోపాల్‌రెడ్డి, అఫ్జల్, ఆజం అలీ, శంకర్, చక్రపాని, హుస్సేన్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఫొటో క్లిక్



ప్రభుత్వ ఆసుపత్రి పక్కన క్రిటికల్ కేర్ భవనం పరిసరాల్లో వేసిన వ్యర్థాలు



వ్యర్థాలు ఉన్న కవర్లను చిందరవందర చేస్తున్న వరాహం

నవ్విపోదురు గాక మాకేంటి

నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న క్రిటికల్ కేర్ భవనం పరిసరాల్లో రోగులకు వాడిన వ్యర్థాలను పారబోస్తున్నారు. మొన్న పశువులు, సోమవారం పందులు ఆ వ్యర్థాలను చిందర వందరం చేశాయి. రోగులు, వారి బంధువులు తిరిగే ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోయడంతో రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రి వర్గాలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో రోగాలు మరింత ప్రబలే అవకాశాలు ఉన్నాయి.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్

27న జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నల్లగొండ, స్పోర్ట్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నల్లగొండ జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగ్జీవన్, ప్రధాన కార్యదర్శి టీ. శంభులింగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు, అండర్- 14, 16, 18, 20 కేటగిరిల్లో బాల, బాలికలు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3,4వ తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

నేడు కాశీ విశ్వేశ్వస్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్‌లోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి 7 గంటలకు శ్రీ విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కుశలయ్య తెలిపారు. అదేవిధంగా మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని శివునికి రుద్రాభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్య హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నార్కట్‌పల్లి డిపోకు 3 బస్సులు కేటాయింపు

నార్కట్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి బస్ డిపోకు 3 పల్లె వెలుగు బస్సులను కేటాయించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఉచిత ప్రయాణం చేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన అన్ని ప్రధాన డిపోలు, బస్టాండుల్లో సంబురాల్లో భాగంగా ఎమ్మెల్యే వేముల వీరేశం వీటిని ప్రారంభించనున్నారు. నార్కట్‌పల్లి నుంచి మోత్కూరు, నకిరేకల్, హైదరాబాద్ మార్గాల్లో ఈ పల్లె వెలుగు బస్సులను నడపనున్నారు.

విద్యార్థులకే నేరుగా కాస్మొటిక్ చార్జీలు



నార్కట్‌పల్లిలోని బీసీ హాస్టల్ భవనం

» బ్యాంకు ఖాతాలు తెరుస్తున్న హాస్టల్ విద్యార్థులు
» దుర్వినియోగం ఉండదనే సర్కారు అభిప్రాయం

నార్కట్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు అందించే కాస్మొటిక్ చార్జీలు ఇకపై నేరుగా వారికే అందనున్నాయి. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు చెల్లించేందుకు ఇప్పటి వరకు అమలులో ఉన్న విధానంలో సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులు మార్పులు ప్రవేశపెట్టారు. కాస్మొటిక్ చార్జీలను నేరుగా విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలోనే వేయాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలోని హాస్టల్ విద్యార్థులందరూ బ్యాంకుల్లో ఖాతాలను తెరిచే పనిలో ఉన్నారు. విద్యార్థులకు అందజేసే కాస్మొటిక్ చార్జీల చెల్లింపులో గతంలో కొంత దుర్వినియోగమైందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సరికొత్త విధానాన్ని తీసుకువస్తున్నారు.

గతంలో హాస్టల్ వార్డెన్‌ల ద్వారా

హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం ప్రతీ నెలా కాస్మొటిక్ చార్జీలు చెల్లిస్తుంది. తరగతులను బట్టి ఈ చార్జీలు ఉన్నాయి. వీటితో సబ్బులు, కొబ్బరి నూనె, పెన్నులు తదితర వస్తువులను విద్యార్థులు కొనుగోలు చేసేవారు. గత విద్యా సంవత్సరం వరకైతే బాలికలకు 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.55లు ఆపైన 10వ తరగతి వరకు రూ.75ల చొప్పున కాస్మొటిక్ చార్జీలు చెల్లించేది. అదేవిధంగా బాలురకైతే 3వ తరగతి నుండి 10 తరగతి వరకు క్షవరం చార్జీలు కలుపుకొని ఒక్కొక్కరికి రూ.62లు కాస్మొటిక్ చార్జీలు చెల్లించేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాలికలకు 3 నుంచి 7 తరగతుల వారికి రూ.175, 8వ నుంచి 10వ తరగతి వరకు రూ.275లు పెంచింది. అదేవిధంగా బాలురకైతే 3 నుంచి 7వ తరగతి వరకు రూ.150, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.200లు పెంచింది. అయితే ఈ డబ్బులను హాస్టల్ ఖాతాలో ప్రభుత్వం జమచేయగా వార్డెన్లు డ్రా చేసి విద్యార్థులకు అందజేసేవారు.

పారదర్శకత కోసమే

కాస్మొటిక్ చార్జీల చెల్లింపు విధానంలో మార్పు కేవలం పారదర్శకత కోసమేనన్న అభిప్రాయం వినపడుతోంది. గతంలో హాస్టల్ ఖాతాలో ప్రభుత్వం విద్యార్థులకు జమచేసే కాస్మొటిక్ చార్జీలను కొందరు వార్డెన్లు విద్యార్థులకు ఇవ్వకుండా చేతివాటానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకే నేరుగా వీటిని జమచేసే విధానం అమల్లోకి వస్తే పారదర్శకత ఉంటుందని, ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిసింది.

బ్యాంకులో జమ చేయడాన్ని స్వాగతిస్తాం



కాస్మొటిక్ చార్జీలను విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేసేలా ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాన్ని స్వాగతిస్తాం. ఇది ఎంతో పారదర్శకమైన విధానం నేరుగా వారి ఖాతాల్లోకి జమచేయడం శుభపరిణామం.

- పల్లగొర్ల మోదీ రాందేవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఖాతాలు తెరవాలని సూచించాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్ విద్యార్థుల కాస్మొటిక్ చార్జీల చెల్లింపు కోసం బ్యాంకుల్లో వ్యక్తిగత ఖాతాలు తెరవాలని సూచిస్తున్నాం. ఏ బ్యాంకులోనైనా ఖాతాలు తెరిచేలా వెసులుబాటు ఉంది. ఇకపై నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే కాస్మొటి క్ చార్జీలు జమ చేయబడతాయి. విద్యార్థులు బ్యాంకు ఖాతాలు ఇవ్వగానే పై అధికారులకు సమర్పిస్తాం.

-రామకృష్ణ, బీసీ ప్రత్యేక హాస్టల్ వార్డెన్, నార్కట్‌పల్లి

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

కట్టంగూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు, వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి పి.కోటేశ్వర్‌రావు అన్నారు. కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే మూడు నెలలు కీలకమని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఇంటి లోపల బయటా చెత్తాచెదారం లేకుండా నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో స్వరూపరాణి, డాక్టర్ శ్వేత, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, నర్సులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి వేడుకలు


భీమారం జడ్పీ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కేతేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో కవితా వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధపోరాటంలో నిజాం నిరంకుశత్వంపై దాశరథి కురిపించిన కవితాగ్నిని స్మరించుకున్నారు. మండలంలోని భీమారం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం భిక్షమయ్య, ఉపాధ్యాయులు ఆర్.పరమేష్, బి.జానకిరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, శివయ్య, శ్రీధర్, శేఖర్, నాగయ్య పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం


శాలిగౌరారంలో పౌష్టికాహారం తింటున్న గర్భిణులు

శాలిగౌరారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి సూర్య శిల్ప అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం, ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు గుజిలాల శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు మాట్లాడుతూ నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని డాక్టర్లు చెప్పిన సలహాలు,సూచనలు పాటించాలని కోరారు. క్లబ్ జిల్లా గ్యాట్ లీడర్ ఎర్ర శంభులింగారెడ్డి, గ్రామ పురోహితులు, లయన్స్ క్లబ్ గ్యాట్ సభ్యుడు రామడుగు వెంకట్రామశర్మ మాట్లాడుతూ శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్, దాత, సింగల్‌విండో వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, క్లబ్ డీసీ సభ్యుడు డెంకల సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, సభ్యులు దునక వెంకన్న, నిమ్మల వీరస్వామి, కప్పల శ్రీకాంత్, పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్లు మరియా, దయామణి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వివిధ గ్రామాల గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

మునుగోడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఎస్ఐ ఇరుగు రవి అన్నారు. డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగులు, రుణ యాప్‌లను నియంత్రించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 24వ నుంచి జిల్లాలో నిర్వహించనున్న సైకిల్‌యాత్ర పోస్టర్లను ఆ సంఘం నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారు ఎన్నో అనర్థాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు కట్ట లింగస్వామి, మిర్యాల భరత్ కుమార్, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి నరేష్, రవి, యాదయ్య, సురేందర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే వీరేశం


కేతేపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, చిట్యాల, నకిరేకల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్, రేషన్‌కార్డులను అందించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజలకు రేషన్‌కార్డులు, పక్కా గృహాలు ఇవ్వకుండా తీరని అన్యాయం చేసిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన గత పాలకులు ప్రజాప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ప్రజల గురించి పట్టించుకోకుండా ఫాంహౌస్‌లోనే ఉంటున్నాడని ఎమ్మెల్యే వీరేశం విమర్శించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులు యుద్ధప్రాతిపాదికన చేస్తున్నట్లు తెలిపారు. కేతేపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ బ్రాంచ్ పోస్టు మాస్టర్ అలుగుబెల్లి యాదగిరిరెడ్డి కుటుంబాన్ని వీరేశం పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మార్కెట్ డైరెక్టర్లు, ఎస్‌కె.లతీఫ్, బయ్య ము త్తయ్య, కె.పర్వయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, మాజీ జడ్పీటీసీలు కోట మల్లికార్జునరావు, జె.లక్ష్మమ్మ, నాయకులు జి.మాధవరెడ్డి, బి.సుందర్, మట్టి సాల్మన్, బి.నరేందర్‌యాదవ్, కోట పుల్లయ్య, బి.జానొరెడ్డి, రవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలో 1600 రేషన్‌కార్డులు, 500కు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వీరేశం తెలిపారు. చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏ సిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణనాయక్, మునిసిపల్ క మిషనర్ దండు శ్రీనివాస్, నాయకులు జడల చినమల్లయ్య, ఏనుగు రఘుమారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● **వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి**

నకిరేకల్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ గుండా వెంకటయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, ధర్మకర్తలు బి.శేఖర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కె.లక్ష్మి, ముత్తయ్య, పూజారులు లక్ష్మీనారాయణచార్యులు, రఘుకుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ సాయికిరణ్

చిట్యాలరూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకుసాగాలని ఎంఈవో పానుగోతు సైదానాయక్ సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆదర్శ్ ఆధ్వర్యంలో యువవికాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, డ్రగ్స్, మత్తుపదార్థాల నిర్మూలన, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు కావాల్సిన మెళకువలను మోటివేటర్ సాయికిరణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో సైదానాయక్ మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పిన విధంగా నడుచుకోవాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్, మత్తుపదార్థాలకే కాకుండా చెడుకు దూరంగా ఉండాలన్నారు. జీవితంలో రాణించాలంటే తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మంచి మాటలను పాటించాలని సూచించారు. లక్ష్యం అనే బీజం చిన్నవయస్సులోనే నాటితే భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కర్నాటి విష్ణు, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆదర్శ్ అధ్యక్షుడు పెండ్యాల రమేష్, కోశాధికారి పనకంటి వెంకట్‌రావు, హెచ్‌ఎం ఆరెడ్ల వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపు, ఓటములు సహజం

నకిరేకల్, జూలై 22, (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు రెండింటినీ సమానంగా చూడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. నకిరేకల్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు ఈ నెల 24వ తేదీన కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఊట్కూరి ఏడుకొండలు, మణికుమార్, వంటిపాక సుందర్, యాతాకుల సోమన్న, చెరుకు వెంకటాద్రి, చెవుగోని శంకర్, గుండాల మల్లేష్, చింతమల్ల శ్రీను, రేకల రాజు, పెండెం సంతోష్, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

కట్టంగూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరసానిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు షూస్, సాక్స్, బ్యాగులను అందజేశారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆకిటి వినోద్, ఆకిటి నవీన్, ఆకిటి మధు, భరత్ వారి కుటుంబసభ్యుల సహకారంతో రూ. 20వేల విలువైన షూస్, సాక్స్, బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చింత యాదగిరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంధ్యారాణి, శంకర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిరక్షించాలి

మునుగోడురూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాల్సిన బాధ్యత గ్రామస్థులపై ఉందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇప్పర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన గోలి లింగస్వామి విద్యార్థులకు అందించిన బ్యాగు, టై, బెల్టు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండేటి నాగేశ్వరరావు, పాఠశాల చైర్మన్ బొజ్జ మల్లీశ్వరి, గ్రామ పెద్దలు భవన మధుసూదన్‌రెడ్డి, బాదరాజు గోవింద్, రవి, సైదులు, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి

కనగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు సీపీఎం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలని కోరారు. సమావేశంలో మండలకార్యదర్శి కానుగు లింగస్వామి, నాయకులు కందుల సైదులు, లింగయ్య, సుల్తానా పాల్గొన్నారు.

కుండలో బోనం అమ్మవారికి శ్రేష్ఠం

చిట్యాల, జూలై22, (ఆంధ్రజ్యోతి): కుండలో బోనం అమ్మవారికి ఎంతో శ్రేష్ఠమని కుమ్మరుల శ్రావణమాసం తొలిబోనాల జాతర నకిరేకల్ నియోజకవర్గ కో కన్వీనర్ తాడూరి చంద్రం తెలిపారు. చిట్యాలలో మంగళవారం తొలి బోనాల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కనగల్ మండలం దర్వేశిపురం అమ్మవారి ఆలయంలో ఈనెల 27వ తేదీన నిర్వహించే కుమ్మరుల శ్రావణమాసం తొలిబోనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కంబంపాటి సతీష్, కుమ్మరసంఘం మండల అధ్యక్షుడు అరూరి సత్తయ్య, నాయకులు రాధారపు గిరి, కంబంపాటి మల్లేష్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, కంబంపాటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపించాలి'

నల్లగొండరూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15 సంవత్సరాలకు సంబంధించిన ఇంటి పన్ను బకాయిలను వసూలు చేసి రెండేళ్లకు సంబంధించి బిల్లులు చెల్లించినట్లు రశీదులు ఇచ్చినట్లు ఆరోపించారు. ఇంటి పర్మిషన్ కోసం అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని, గ్రామపంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులు పేరుతో బిల్లులు సృష్టించి డబ్బులు నొక్కేసారని తెలిపారు. పంచాయతీ కార్మికులపై వివక్ష చూపుతున్నాడని, డ్యూటీలకు ఆలస్యంగా వస్తున్నారనే కారణంతో జీతాలు కట్ చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా నిడమనూరులో జీపీ కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి, పని భారాన్ని పెంచి కార్మికులను ఇబ్బందులు గురిచేస్తున్నాడని అన్నారు. అతనిపై సమగ్ర విచారణ చేపట్టి చ ర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు పోలే సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈఎన్‌సీని కలిసిన ఇంజనీర్స్ అసోసియేషన్

నార్కట్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్) నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన రమేష్‌బాబును నల్లగొండ డివిజన్‌కు చెందిన ఇంజనీర్లు హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ తరఫున మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జలసౌధలోని శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రమేష్‌బాబును కలిసిన వారిలో హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రవీందర్, జనరల్ సెక్రటరీలు కె.చక్రధర్, పి.పిచ్చ్యాలతో పాటు నల్లగొండ డివిజన్‌కు చెందిన ఏఈఈలు విజయలక్ష్మి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

శ్రావణ్‌కుమార్‌కు తెలుగులో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న బరిగెల శ్రావణ్‌కుమార్

నల్లగొండ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన బరిగెల శ్రావణ్ కుమార్ తెలుగు విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించి బంగారు పతకం సాధించారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల స్నాతకోత్సవ స్థాయి (2022-24) తెలుగు విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించి గోల్డ్‌మెడల్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్తాఫ్ ఖాజాహుస్సేన్ శ్రావణ్‌కుమార్‌కు బంగారు పతకం అందజేశారు. ప్రతిభ కనబరిచిన శ్రావణ్‌కమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్, తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, అధ్యాపకులు డాక్టర్ టంగుటూరి సైదులు, పనసబోయిన ప్రభాకర్, గోవర్ధన్ గిరి, లింగస్వామి, కవి, రచయితలు తుల శ్రీనివాస్, సాగర్ల సత్తయ్య, భద్రయ్య, శంకర్ అభినందించారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 23 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	570.50 (257.8295)	74,474	4835
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.65 (3.82)	1652.65	639.49
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.362 (19.5330)		400

చికెన్ ధరలు	లైవ్ : రూ.140	డ్రెస్ : రూ.210	స్కిన్‌లెస్ : రూ.240



₹502 కోట్లు

ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు లబ్ధి



- ఉమ్మడి జిల్లాలో 10.31 కోట్ల మంది మహిళల ప్రయాణం
- నేడు రీజియన్‌లోని అన్ని డిపోల్లో సంబరాలు

నల్లగొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటలలోనే అమలు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ద్వారా నల్లగొండ రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు 10,31,28,640మంది మహిళలు ప్రయాణంచేశారు. దీంతో మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం వల్ల రూ.502 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు రవాణా సంస్థ ఆదేశాలకనుగుణంగా ఈ నెల 23వ తేదీన బుధవారం నాడు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల పరిధిలో సంబరాలను చేయడానికి నిర్ణయించారు. ఈసంబరాల్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల కు వివిధ పోటీలను నిర్వహించడంతోపాటు బస్సులలో రెగ్యులర్‌గా ప్రయాణించే ఐదుగు రు మహిళలను గుర్తించి వారికి సన్మానం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు...

- మిగతా 7వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు రాజకీయపార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. స్థానిక ఎన్నికల నిర్వహణ ఖాయంగా ఉంటుందనే సంకేతాలతో పార్టీ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీ ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాయి. వామపక్ష పార్టీల నాయకులు సైతం అవకాశమున్నచోట బరిలో దిగేందుకు ప్రయత్నిస్తుండగా, బీఆర్‌ఎస్ నాయకులు సైతం రిజర్వేషన్లు ఖరారయితే పోటీపడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



స్థానిక సంగ్రామానికి.. రెడీ

- పరిషత్ ఎన్నికలపై పార్టీల కసరత్తు
- ప్రతి స్థానమూ దక్కించుకునేలా కాంగ్రెస్ వ్యూహం
- సత్తా చాటేందుకు ప్రతిపక్షాల తహతహ
- రిజర్వేషన్లు తేలితే రసవత్తరంగా సాగనున్న స్థానిక సమరం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో స్థానిక ఎన్నికల పోరుకు రాజకీయపార్టీలు, నాయకులు రంగం సిద్ధం చేసుకుంటుండడంతో క్షేత్రస్థాయిలో సందడి మొదలైంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ స్థానిక సంస్థల్లోనూ విజయబావుటా ఎగురవేయడమే ఏకైక లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఓ వైపు ఇప్పటికే సం స్థాగత ఎన్నికల ప్రక్రియను సీరియస్‌గా కొనసాగిస్తు న్న ఆ పార్టీ ఉమ్మడి జిల్లాలో తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ పట్టుని నిరూపించుకునేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో వంద శాతం విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా గురిపెట్టారు. తమతమ నియోజకవర్గాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఏ రిజర్వేషన్ వస్తే ఎవరికి అవకాశమివ్వాలి....? బలమైన నాయకులకు అవకాశమివ్వలేకపోతే వారికి ఎలా నచ్చజెప్పాలనే అంశంలో ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. పార్టీకి, నాయకత్వానికి విధేయతగా ఉంటూ వచ్చిన నాయకులు, యువతకు ఈసారి అవకాశాలు దక్కుతాయని అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యేలు సూచించిన వారికే అభ్యర్థిత్వాలు దక్కనుండడంతో ద్వితీయ, క్షేత్రస్థాయి నాయకులు వారిని ప్రస న్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మండలంలో, ఎంపీటీసీ స్థానం పరిధిలో తమ మద్దతుదారులతో కలిసి ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రుల ను కలుస్తూ వారి దృష్టిలో పడే ప్రయత్నాలు చేస్తున్నారు.

పోటీకి సై అంటోన్న ప్రతిపక్షాలు..

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఎన్నికల్లో పోటీచేసి సత్తా చాటేందుకు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ సైతం సిద్ధమవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుపై అధిష్ఠానంనుంచి స్పష్టత వస్తే దానికనుగుణంగా పోటీచేసే అంశంపై కార్యాచరణ రూపొందించుకునేందుకు ఆ పార్టీ నాయకులు సిద్ధమవుతుండగా, సీపీఎం తమకు పట్టున్న స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఆయా స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న నాయకులు ఇప్పటికే స్థానిక సమస్యలపైనా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు సైతం స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీకి పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వం ఎన్నికల ప్రకటన విడుదల చేసిన తక్షణమే అభ్యర్థుల ఎంపికచేసి ప్రచారంలోకి దిగుతామని ఆపార్టీ నేతలు చెబుతున్నారు. రిజర్వేషన్లు తేలితే అభ్యర్థుల ఎంపిక చేపట్టేందుకు పార్టీనేతలు...

- మిగతా 7వ పేజీలో...

కొత్త రేషన్‌కార్డులు 49వేలు

జిల్లాలో 25 నుంచి పంపిణీకి ఏర్పాట్లు



నల్లగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 49వేల కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ప్రభుత్వం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించేందు కు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికార యం త్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. అయితే ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులు జిల్లాలోని 8 మండలాల్లో కొంతమందికి పంపిణీ చేపట్టారు. జిల్లాలో నల్లగొండ, తిప్పర్తి, కనగల్, నకిరేకల్, కేతేపల్లి, చిట్యాలతో పాటు మిర్యాలగూడ డివిజన్‌లోని రెండు మండలాల్లో రేషన్‌కార్డుల పంపిణీ జరిగింది. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టారు. ఇందుకు సంబంధించిన ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పౌరసరఫరాలు, ఇతర శాఖల అధికారులకు సూచించడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 5,15,061 కార్డులు

నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 4,66,061 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి 13,85,506 యూనిట్లు పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలనలో 96వేల దరఖాస్తులు రాగా ఇందులో 49వేల మందికి కొత్తగా రేషన్‌కార్డులు అందజేస్తున్నారు. అంటే జిల్లాలో మొత్తం రేషన్‌కార్డులు 5,15,061కు చేరాయి. కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారందరికీ సెప్టెంబరు నెలలో రేషన్‌బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. జూన్‌లో మూడు నెలలకు కలిపి రేషన్ కార్డుదారులకు 26వేల మెట్రిక్ టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. మూడు నెలలకు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేయడంతో ప్రతి ఒక్కరూ రేషన్ కార్డు కావాలని కోరుకుంటున్నారు. సన్నబియ్యంతో రేషన్ కార్డు విలువ పెరిగింది. లబ్ధిదారులకు గతంలో ఉన్న ఆహార భద్రత కార్డు మాదిరిగానే కొత్త రేషన్‌కార్డు కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరిట శుభాకాంక్షలతో ముద్రించిన లేఖలను అందజేస్తున్నారు. పూర్తిస్థాయిలో డిజిటల్ కార్డు ఇప్పట్లో అందజేసే అవకాశాలు లేక పోవడంతో లేఖల రూపంలో ముద్రించిన వాటినే కార్డులుగా అందజేస్తున్నారు. వాటిని రేషన్ దుకాణానికి తీసుకెళ్తే లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తారు. డిజిటల్ కార్డు వచ్చే వరకు ఈ లేఖను జాగ్రత్తగా పెట్టుకోవాల్సి ఉంటుంది.

రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరం

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు కొత్తగా మీసేవా నుంచి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందజేస్తున్నారు. ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను నిరంతరంగా చేపట్టనుం ది. చాలా మంది అర్హులు రేషన్‌కార్డు వస్తుందో లేదోనన్న నేపథ్యంలో ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్‌కార్డు తప్పకుండా ఇస్తామని స్పష్టత ఇచ్చింది. అయితే ప్రజాపాలనలో 96 వేల దరఖాస్తులు వస్తే కేవలం 49 వేల రేషన్ కార్డులు మంజూరు కాగా 47వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతోనే అర్హులైన చాలామంది లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. తమ దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారనే దానిపై ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్న వారంతా రెవెన్యూ కార్యాలయం, పౌరసరఫరాల కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మళ్లీ దరఖాస్తులను పరిశీలిస్తుందా? లేదా పక్కనపెడతుందా? అనేది లబ్ధిదారులకు ఎటు పాలుపోవడం లే దు. రేషన్ కార్డులపై సన్నబియ్యం వస్తుండటంతో చా లా మంది నిరుపేదలు రేషన్‌కార్డు కోసం ఎదురు చూ స్తున్నారు. అంతే కాక ప్రతీ సంక్షేమ పథకానికి ప్రభుత్వం రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుందన్న ఆలోచనతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరుగుతోంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు

జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు పంపిణీ చేస్తాం. కొత్తగా రేషన్‌కార్డులు 49వేలు మంజూరయ్యాయి. ఇప్పటికే 8మండలాల్లో రేషన్‌కార్డుల పంపిణీ పూర్తయింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు రేషన్‌కార్డులను పంపిణీ చేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షల పేరిట లబ్ధిదారులకు ఈ రేషన్‌కార్డులను అందజేస్తాం. రేషన్‌కార్డు ద్వారా ప్రతీ కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తాం.

- వెంకటేశ్వర్లు, డీఎస్‌వో నల్లగొండ

'భూ భారతి' దరఖాస్తులను పరిష్కరించాలి

రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, అధికారులు

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 22 (ఆంధ్రజ్యోతి): భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల్లో సాధ్యమైనన్ని ఆగస్టు 14వ తేదీలోపు పరిష్కరించాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వివిధ అంశాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరు లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు కొన్ని జిల్లాల్లో ఇసుక ఇబ్బంది ఉందని, ఇసుక అందుబాటులో ఉన్న జిల్లాలు ఇతర జిల్లాలకు సరఫరా చేయాలని అన్నారు. ఇసుక కారణంగా ఇందిరమ్మ ఇళ్లు ఎక్కడా ఆగవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించాలని ఆయన సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు పథకం కింద పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వనమహోత్సవం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఒకరోజు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెద్దమొత్తంలో పెద్ద మొక్కలు నాటాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఎయిడ్స్ అప్లయెన్సెస్ కోసం లబ్ధిదారులను గుర్తించి జాబితా పంపాలన్నారు.

హెల్త్ కమిటీలను వేగవంతం చేయాలి : కలెక్టర్

పారిశుధ్యం, ఆరోగ్య విషయాలపై పాఠశాల స్థాయి మొదలుకొని మండల, జిల్లా స్థాయిలో శానిటేషన్, హెల్త్ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఈ అంశంపై ప్రతీరోజు పర్యవేక్షించాలని, ప్రత్యేకించి ఈత చెట్లు ఎక్కువగా నాటాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పెంచాలని, స్టోన్ క్రషర్ ధరలు నిర్ణయించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌కు సూచించారు. పాఠశాలల పరిధిలో పారిశుధ్యం, ఆరోగ్యానికి సంబంధించి పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయా సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలల్లో అత్యవసరమైన సివిల్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆర్‌సీవోలను ఆదేశించారు. ఆయా పాఠశాలలకు గుడ్డ సరఫరా విషయమై శుక్రవారం నాటికి టెండర్లను పూర్తిచేయాలని, అలాగే సంక్షేమ శాఖకు సంబంధించి ఉపకరణాల విషయంలో వివరాలు సమర్పించాలని సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్‌అమిత్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సింహవాహినీ దేవిగా ఎల్లమ్మ తల్లి



కనగల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం ఆషాఢమాసం చివరి మంగళవారం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారు సింహవాహినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణల అనంతరం అమ్మవారిని దివ్యస్వరూపాన్ని దర్శించుకుని పరవశించారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపిం చి చీరసారె బోనసైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి, సిబ్బంది, అర్చకులు తదితరులున్నారు.

పోషణ కిట్లను వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

నార్కట్‌పల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్తులు పోషణ కిట్లను సద్వినియోగం చేసకోవాలని జిల్లా వైద్యశాఖాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని క్షయ బాధితులకు క్యూబ్స్ అండ్ బ్రౌజ్ అనే స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఫుడ్ బ్యాగ్‌లను ఆయన నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో మంగళవారం అందజేశా రు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 100 రోజుల టీబీ ముక్త్‌భారత్‌లో భాగంగా ఈ కిట్లను వినియోగించుకొని క్షయ రోగులు కోలుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఈ వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి కల్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, కేశ రవి, డీపీవో విష్ణు, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్, అజయ్, సైదులు పాల్గొన్నారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 22 (ఆంధ్రజ్యోతి) : యూరియాను వ్యవసాయ పనులకు కాకుండా ఇతర పనులకు దారి మళ్లిస్తే సంబంధిత ఎరువుల దుకాణం యజమానితోపాటు, సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఎరువుల ఫిర్యాదుల కేంద్రాన్ని, టోల్ ఫ్రీ నెంబర్ (18004251442)ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు మొదటి వారంలో నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాలకు సాగునీరు వస్తున్నప్పటికీ, జిల్లావ్యాప్తంగా ముమ్మర వ్యవసాయ సాగు, విత్తనాలు, నాట్లు వేసే సమయంలో సైతం అవసరమైనన్నీ ఎరువులను సరఫరా చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎరువులకు ఎవరూ కంగారు పడాల్సిన పని లేదన్నారు. ఒకేసారి 30 లేదా 40 బస్తాల ఎరువులను తీసుకు వెళ్లే వారిపై చర్య తీసుకుంటామన్నారు. ఎరువుల పర్యవేక్షణకై ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు చెప్పారు. మిర్యాలగూడ ఎరువుల గోదామును ఎప్పటికప్పుడు తాము సందర్శిస్తున్నామని, ఈ నెలాఖరులోగా జిల్లాకు 3000 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని స్పష్టం చేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతాయి

మిర్యాలగూడ: సన్నబియ్యం రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇల్లు పెన్షన్ల వంటివి పేదల ఆత్మగౌరవాన్ని పెంచే కార్యక్రమాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం ఎమ్మె ల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డుల్లో పేర్లు లేనివారు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందన్నారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 15వేల రేషన్‌కార్డులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమం అనంతరం నాగార్జున జిల్లా మార్కెటింగ్ సొసైటీలోని ఎరువులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడెడ్ రెసిడెన్షియల్ పాఠశాల,జూనియర్ కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. కార్యక్రమంలోసబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ హరీష్, తహసీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

మాడ్గులపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి) రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, పారిశుధ్య చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వంటి అంశాలపై చర్చించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఎరువుల దుకాణాల ముందు ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పావని, ఎంపీడీవో సంగీత, ఏవో శివరామ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువులను సక్రమంగా పంపిణీ చేయాలి

మిర్యాలగూడ: ప్రాథమిక సహకార కేంద్రాల ద్వారా రైతులకు సక్రమంగా ఎరువులను పంపిణీ చేయాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. మిర్యాలగూడ పట్టణంలోని పీఏసీఎస్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీల్లో స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. రైతుల ఆధార్‌ను నమోదు చేసుకుని యూరియాను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి సైదానాయక్, తహసీల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి కుంకుమార్చన

అడవిదేవులపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రంలోని మహిషాసుమర్ధిని అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకని ఈనెల 25 నుంచి ఆగస్టు 23 వరకు సహస్ర కుంకుమార్చననిర్వహించనున్నట్లు అర్చకుడు రామ్మోహన్ మంగళవారం తెలిపారు. పాల్గొనే భక్తులకు సంబంధించిన గోత్ర నామాలతో పూజాలు నిర్వహించనున్నందున భక్తులు గోత్రనామార్చనలకు తరలిరావాలని కోరారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ప్రారంభం

నేరేడుగొమ్ము, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమునిగల్‌లో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పెద్దమునిగల్ చర్చి నుంచి గ్రామం వరకు కిలోమీటర్ మేర రూ.2.75 లక్షలతో పనులు ప్రారంభించినట్లు మాజీ ఎంపీటీసీ కోతి యుగేందర్‌రెడ్డి తెలిపారు. దీంతో పెద్దమునిగల్ రోడ్డుకు రాత్రి వేళలో వెలుతురు రానుంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీదేవి, మండల వైద్యాధికారి, చింతపల్లి



ఇంటర్వ్యూ Interview

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధుల నివారణ, ఓపీ సేవలు, మందుల లభ్యత, ఉప కేంద్రాల పనితీరు సమయ పాలన తదితర అంశాల గురించి ఆమె 'ఆంధ్రజ్యోతి'కి మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. (ఆంధ్రజ్యోతి- చింతపల్లి)

ఆంధ్రజ్యోతి: వర్షాకాలంలో ఏఏ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయి ?

వైద్యాధికారి: వర్షాకాలంలోకొత్త నీరు వస్తున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తిస్తాయి. జ్వరం, జలుబు, దగ్గు డెంగీ, మలేరియా వచ్చే అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: వ్యాధుల నిఆరణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు ?

వైద్యాధికారి: వ్యాధుల నివారణకు ముందస్తుగా ప్రజలు చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని గోరువెచ్చగా చేసి తాగాలి. నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్త పడితే రోగాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీలో ఎలాంటి సేవలు అందిస్తున్నారు ?

వైద్యాధికారి: పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉంటూ రోగులకు సేవలు అందిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: పీహెచ్‌సీ 24 గంటల పని చేస్తుందా ?

వైద్యాధికారి: 24 గంటల వరకు పీహెచ్‌సీ పని చేస్తుంది. రాత్రి వేళలో కూడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారా ?

వైద్యాధికారి: మండల కేంద్రంతో పాటు వెంకటేశ్వరనగర్(మాల్)లోని పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నారా ?

వైద్యాధికారి: సీజనల్ వ్యాధుల కోసం ఆశ కార్యకర్తలతో పాటు వైద్యులు ప్రజల కు అవగాహన కల్పిస్తున్నాం. ముందస్తుగా ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలను నియంత్రించవచ్చు.

నేడు మిర్యాలగూడలో 'ప్రజావాణి '

మిర్యాలగూడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో బుధవారం (నేడు) నిర్వహించనున్న ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వారంలో రెండు రోజులు బుధ, శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా వాణిలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసాచారి పంచాయతీరాజ్ డీఈ, ఇరిగేషన్ డీఈ, అగ్రికల్చర్ ఏడీఈ సైదానాయక్ పాల్గొననున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను అధికారులు 15 రోజుల్లో పరిష్కారిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రహరీ లేక పాట్లు

- దేవరకొండ మండలం కొమ్మెపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు
- క్రిమికీటకాలు, పాములు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన

(ఆంధ్రజ్యోతి -దేవరకొండ)

మండలంలోని కొమ్మేపల్లి గ్రామ శివారులో 2022 సంవత్సరంలో గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు ఉన్నాయి. ప్రస్తుతం పాఠశాలలో దాదాపుగా 640 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. అయితే పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం వర్షాకాలం కావడం, గురుకుల పాఠశాల వ్యవసాయ పొలాల మధ్యలో ఉండడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, క్రిమికీటకాలు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలెక్టర్, ఆర్డీవో, గిరిజన గురుకుల పాఠశాల అధికారులకు విన్నవించినట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతురెడ్డి తెలిపారు. ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రహరీ లేక ఇబ్బందులు ఎదుతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.



కొమ్మేపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల భవనం

బయటకు వెళ్లాలంటేనే భయమేస్తోంది



పాఠశాల ఆవరణ బయటకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. తేళ్లు, పా ములు, క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి.వర్షాకాలం కావడంతో పురుగులు వస్తున్నాయి. ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలి.

\- తరుణ్, ఇంటర్ విద్యార్థి

ప్రహరీని నిర్మించాలి



ప్రహరీ నిర్మించి రక్షణ కల్పించాలి. కొన్నేళ్లుగా ప్రహరీ లేకపోవడంతో క్రిమికీటకాలు కళాశాలలోకి వస్తున్నాయి. దీంతో భయపడే పరిస్థితి. ప్రహరీ నిర్మాణం జరపాలి.

\- హర్షిత్, 10వ తరగతి విద్యార్థి

డ్రైనేజీలో పూడిక తీత



వీ.టీ.నగర్‌లో డ్రైనేజీ పూడిక తీత తీస్తున్న కార్యదర్శి పద్మ

చింతపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)13వ వార్డులో కొంత కాలంగా డ్రైనేజీ వ్యవస్థతో కాలనీవాసులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం కాలనీవాసులు డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం గొడకొండ్ల పంచాయతీ కార్యదర్శి పద్మ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వెంటనే 13వ వార్డులో పరిశీలించి డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని సిబ్బందికి ఆదేశించింది. కంప్రెషర్‌తో కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు మురుగునీటిని పూడిక తీశారు. కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి



మిర్యాలగూడ: గ్రంథాలయంలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభాకర్, పాల్గొన్న పాఠకులు, తదితరులు

మిర్యాలగూడ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం గర్వించే మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని విద్యావేత్త కస్తూరి ప్రభాకర్ అన్నారు. దాశరథి జయంతిని స్థానిక మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం వ్యతిరేకంగా సాగిన తొలి సాయుధ పోరాటంలో దాశరథి భాగస్వామ్యులయ్యారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ వెలుగెత్తి చాటాడు. తెలంగాణ సాహిత్యంలో ఉద్యమ కవిత్వాన్ని రచించిన దాశరథి ఈ ప్రాంత ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. లైబ్రేరియన్ శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రముఖుల జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. అనంతరం దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుధాకర్, రవి, సునీల్, చంటి, వెంకటేష్, శ్రీను పార్వతి, దివ్య, మమత, నాగలక్ష్మి, సుమలత, కవిత, అనిత పాల్గొన్నారు.

నిజాం నిరంకుశత్వంపై గళమెత్తిన కవి దాశరథి

మిర్యాలగూడ రూరల్ : నిజాం నిరంకుశత్వంపై తనదైన శైలిలో గళమెత్తిన గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రధానోపాధ్యాయుడు గుడిపాటి కోటయ్య అన్నారు. మంగళవారం దాశరథి జయంతి సందర్భంగా మండలంలోని జప్తివీరప్పగూడెం జడ్పీహైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ప్రజల దోపిడికి, అణిచివేతకు, పీడనకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశత్వంపై కలమెత్తిన గొప్ప కవి దాశరథి అని అన్నారు. 19 ఏళ్ల వయస్సులోనే నిజాంకు వ్యతిరేకంగా పోరడగా ఇందూరు జైలులో వేశారని, జైలు గోడలపై బొగ్గుతో కవిత్వాలు రాసి నిజాం ప్రభుత్వాన్ని ధిక్కరించారని అన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోని సమాజం లో జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, జలరాం, చంద్రకళ, రవికుమార్, రేణుక పాల్గొన్నారు.

● హాలియా : దాశరథి కృష్ణమాచార్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. మంగళవారం హాలియాలో దాశరథి కృష్ణమాచార్య చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుల మదన్‌రెడ్డి, కం దుల నారాయణరెడ్డి, నీలా ప్రభాకర్, రమావత్ చెన్నానాయక్, రమావత్ కళ్యాణ్‌నాయక్, గురజాల రాకేష్, ఇరిగి సోమేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ రూరల్ : దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పురోహితులను సన్మానిస్తున్న కుర్మేటి రవిప్రసాద్‌శర్మ

డిండి, జూలై 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ ప్ర భుత్వాన్ని కోరారు. మండలంలోని చెర్కుపల్లి స్వయంబు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన బ్రాహ్మణసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండి తమ సమస్యలను సాధించుకోవాలన్నారు. గ్రామపురోహితులు చెర్కుపల్లి అజయ్‌శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడు బహుగానం చంద్రశేఖరశర్మ, ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌శర్మ, భాస్కరశర్మ, గణపతిశర్మ, చంద్రశేఖరశర్మ, సురభి కృష్ణమూర్తి, వైద్యుల కృష్ణమూర్తి, కుర్మేటి భిక్షపతి, కుర్మేటి వంశీ, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. పురోహితులను శాలువాతో సన్మానించారు.

ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం

డిండి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటికబండతండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్‌నాయక్ రూ.లక్ష విరాళం ఆలయకమిటీకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో తాను పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో కొర్ర పాండు, రాము తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనుల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొండమల్లేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.1.20 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నాయిని జమునామాధవరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రాధాన్య మిస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ.సిరాజ్‌ఖాన్, బూడిద మల్లేష్‌యాదవ్, కోట్ల జగదీశ్, నజీర్‌మౌలానా, ఎండీ.ముజీబ్, వీరమళ్ల ఎల్లయ్య, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి



రణభేరి సభ పోస్టరును ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పెద్దఅడిశర్లపల్లి,జూలై22(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన సముచిత స్థానం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి మండల అధ్యక్షుడు విడియాల రామయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల శేఖర్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం హైదరాబాద్‌లో ఆగస్టు 3వ తేదీన ఆర్యవైశ్య రాజకీయ రణభేరి సభ పోస్టరును స్థానిక సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి మిర్యాల సత్యం, గౌరవ అధ్యక్షుడు వీరమళ్ల పరమేశ, జిల్లా సహాయ కార్యదర్శి మంచాల బాబు, మంచాల శ్రీనివాస్, విడియాల ధనంజయ్య, శ్రీనివాస్, శ్రీను కోటి, పాండు పాల్గొన్నారు.

నేటి విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి

దేవరకొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బుధవారం నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బూడిద వెంకటేష్ కోరారు. దేవరకొండలో మంగళవారం నిర్వహించి ఆ యా సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీని అరికట్టాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సం ఘాల నాయకులు ఇద్దిరాములు, రాకేష్, భాను, శివ పాల్గొన్నారు.

● దామరచర్ల : విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం వైఖరికి నిరసనగా బుధవారం నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాహుల్, విష్ణు, అజయ్, సాగర్, మహేష్, రాజేష్, జగన్ పాల్గొన్నారు.

విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గోదా వరి జలాల్లో తెలంగా ణ నీటి వాటాను దక్కించుకునేందుకు విద్యార్థులు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ పిలుపునిచ్చాడు. మంగళవారం ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బకనచర్ల ప్రాజెక్టుతో ఏపీ ప్రభుత్వం నీటి అక్రమ వినియోగానికి చర్యలు చేపట్టిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలను నినాదంతో మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమం చేపట్టి అందరినీ భాగస్వాములు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారమైన అనంతరం రాష్ట్రం పచ్చని హా రంలా మారిందన్నారు.

అయితే ఏపీ సీఎం చంద్రబాబు గోదావరి నదిపై అక్రమంగా ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీటిని తరలించేందుకు చర్యలు చేపట్టారన్నారు. బకనచర్ల వ్యవహారంపై కాంగ్రెస్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలేనన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు శివనాయక్, మండల అధ్యక్షుడు మహేష్‌గౌడ్, అభి, సురేష్ యాదవ్, శ్రీనునాయక్, మహేష్ ప్రసాద్, నగేష్ పాల్గొన్నారు.

గోరింటాకు సంబురం

పెద్దవూర, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకుని మండలంలోని పొట్టివానికుంటతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం గోరింటాకు సంబురం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డి మాట్లాడుతూ గోరింటాకు పండుగ మన దేశంలో ప్రాచీనమైన సాంస్కృతిక, సంప్రదాయ ఆచార వ్యవహారంలో భాగంగా జరుపుకుంటున్నారని అన్నారు. ఆషాఢ మాసం మహిళలకు ప్రత్యేకమైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగమ్మ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక నొప్పులు ఉంటే వైద్య పరీక్షలు చేయించాలి

● న్యూరో సర్జన్ శ్రీనివాస్ బొట్ల

మిర్యాలగూడ, జూలై 22(ఆంధ్రజ్యోతి): శరీరంలో ఏదేని ఒక భాగంలో దీర్ఘకాలికంగా నొప్పి కలిగిస్తుంటే అన్ని పరీక్షలు చేయించుకోవాలని న్యూరో సర్జన్ శ్రీనివాస్ బొట్ల అన్నారు. స్థానిక లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం యశోధ దవాఖానా ఆధ్వర్యంలో వ్యాధులపై రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా నొప్పులతో బాధపడుతుంటే మూలకారణం తెలుసుకున్న తర్వాతే వైద్యం పొందాలన్నారు. మిర్యాలగూడకు చెందిన ఓ మహిళ వెన్ను నొప్పి రావడంతో డాక్టర్ స్పాండలోసిస్ సమస్యగా పరిగణించి మెడిసిన్ ఇవ్వగా మాత్రలు వాడుతున్నప్పటికీ రోజురోజుకు నొప్పి పెరిగి కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితికి చేరుకున్నారని అన్నారు. ఎంఆర్ఐ పరీక్ష చేయించగా వెన్నముకలో ట్యూమర్ వున్నట్లు గుర్తించామని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరక్టర్ గోరుకంటి పవన్, కె. ఎనివాసరెడ్డి, శ్రీనివాస్ చిదుర, ఏ. వాసుకిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.